క్లుప్తంగా

అంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన



నడికూడ: మండల కేంద్రంలో సీతారామాంజనేయ స్వామి ఆలయం పునఃనిర్మాణంలో భాగంగా ఆలయ పురోహితుడు గోపినాథ్ శర్మ, ఆచార్యులు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం అంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపను వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


సుదర్శన్‌రెడ్డి


రాజు

ఐనవోలు: మండలంలోని కొండపర్తి గ్రామంలోని చైతన్య, యువ చైతన్య పురుషుల పొదుపు సంఘాల నూతన అధ్యక్షులుగా మండల సుదర్శన్ రెడ్డి, కట్కూరి రాజులు ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి ప్రతాపరుద్ర పొదుపు సమితి ప్రతినిధి మాచర్ల రంజిత్ తెలిపారు. గురువారం జరిగిన వార్షిక మహాసభలో వారిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కట్కూరి శంకర్, మాచర్ల సుమన్‌లను ఎన్నుకున్నారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

వేలేరు: ప్రభుత్వం నిషేధించిన పొగాకు, గుట్కా ఉత్పత్తులను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై సురేష్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్లికుదుర్ల, సోడాషపల్లి గ్రామాల్లో బచ్చు చంద్రయ్య, గౌరిశెట్టి శ్వేతలు కిరాణ షాపుల్లో గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న కానిస్టేబుల్స్ అనిల్, ఏక రాజులను చూసి పారిపోయేందుకు ప్రయత్నం చేయగా సిబ్బంది అప్రమత్తమై వారిని పట్టుకుని తనిఖీ చేయగా గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. చంద్రయ్య వద్ద రూ.1,038, శ్వేత వద్ద రూ.2,576ల విలువ చేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నాయకులు

కమలాపూర్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కమలాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలి వద్ద పొన్నం ప్రభాకర్ జన్మదిన కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్, హుజూరాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడ శ్రీకాంత్, ఇల్లందకుంట దేవస్థాన డైరెక్టర్ రిక్కల నారాయణరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, ఆకినపెల్లి భిక్షపతి, నిగ్గుల లింగయ్య, కిన్నెర కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకులు గుండపు చరణ్‌పటేల్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

పరకాల: ఎండాకాలంలో డోర్‌లు తీసుకొని ఇంట్లో నిద్రపోయే వారిని లక్ష్యంగా చేసుకొని సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్తున్న దొంగను పరకాల పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పరకాల సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ నగరంలోని శంభునిపేటకు చెందిన మహ్మద్ సోహెల్ అనే యువకుడు ఈ నెల 6న పరకాల పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని ఓ ఇంట్లోకి దూరి మూడు సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లాడు. ఎండాకాలం కావడంతో తలుపులు తీసి మెస్‌డోర్ వేసి పడుకోగా ఈ విషయాన్ని ఆసరాగా చేసుకొని ఇంట్లో డ్రెస్సింగ్ టేబుల్‌పై ఉన్న సెల్ ఫోన్లు ఎత్తుకెళ్లి తిరిగి రెండు రోజుల తర్వాత పరకాలలోనే అమ్మకానికి బస్టాండ్ సమీపంలోకి వచ్చాడు. సమాచారం అందగానే పరకాల పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

కమలాపూర్: మండలంలోని మర్రిపల్లిగూడెంలోని కాకతీయ విద్యాలయ గుర్తింపు రద్దు చేయాలని డీఎస్‌ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా గురువారం సమ్మర్ క్లాసులు నిర్వహిస్తుండగా డీఎస్‌ఏ ఆధ్వర్యంలో పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం శివ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో ఐఐటీ తరగతులు నిర్వహిస్తున్నప్పటికి విద్యాశాఖ అధికారులు చర్య తీసుకోవడం లేదన్నారు. విద్యా శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మామిడి రైతులకు వర్షం దెబ్బ

- నేలరాలి దెబ్బతిన్న మామిడికాయలు
- పెట్టుబడులు రాక ఆందోళన
- నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకోలు
- కమలాపూర్‌లో 415 హెక్టార్లలో సాగు



దెబ్బతిన్న మామిడికాయలు చూపుతున్న రైతు

కమలాపూర్ : అష్టకష్టాలకోర్చి సాగు చేసిన మామిడి పంట చేతికొచ్చే దశలో ఈదురుగాలుల రూపంలో ప్రకృతి వికృతరూపం దాల్చడంతో మామిడి కాయంతా నేలరాలి దెబ్బతిని ఎందుకు పనికి రాకుండా పోయింది. దీంతో పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితుల్లో రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని మామిడి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కరుణించి పంట నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

వందల ఎకరాల్లో పంటకు నష్టం..

ఈదురుగాలుల బీభత్సానికి మండల వ్యాప్తంగా వందల ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిని రైతులు నష్టపోయారు. మండల వ్యాప్తంగా సుమారు 415 హెక్టార్లలో 217 మంది రైతులు మామిడి పంట సాగు చేయగా, పంట చేతికొచ్చిందని సంబురపడుతున్న రైతులను ఈదురుగాలులు నిండా ముంచాయి. ఏప్రిల్ 16న రాత్రి మొదటిసారి, మే 1న రాత్రి రెండోసారి, 4న రాత్రి మూడోసారి ఇలా కేవలం 20 రోజుల వ్యవధిలో మూడుసార్లు బలమైన ఈదురుగాలులు వీయడంతో మామిడి కాయంతా పూర్తిగా నేలరాలింది.

ఆదేశాలు రాగానే సర్వే చేస్తాం..

మామిడి పంట నష్టపోయామని కొందరు రైతులు ఫోన్లు చేస్తున్నారు. కానీ తమకు ప్రభుత్వం నుంచి ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు రాగానే మామిడి పంట నష్టంపై సర్వే చేపట్టి ప్రభుత్వానికి నివేదిస్తాం. పంట నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తాం.

\- మధులిక, ఉద్యానశాఖ అధికారి

నష్ట పరిహారం ఇవ్వాలి



నాకున్న మూడెకరాల్లో మామిడి పంట సాగు చేసిన. ఇక పంట చేతికి వస్తుందని సంబుర పడుతుండగానే ఈదురుగాలులకు కాయంతా నేలరాలి దెబ్బతింది. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటి వరకు అధికారులు పంట నష్టంపై సర్వే చేయలేదు. సర్వే చేసి పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇచ్చి న్యాయం చేయాలి.

\- గందసిరి రవి, కమలాపూర్

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు



కానిపర్తి శివారులో ఐదెకరాల మామిడి తోట కౌలుకు తీసుకున్న. కౌలు డబ్బులు, పెట్టుబడి కలిపి రూ.3.50 లక్షలు అయింది. ఈదురుగాలులకు కాయంతా నేలరాలింది. రాలినకాయ అమ్మితే కాయ ఏరిన కూళ్లు, రవాణా ఖర్చుకు సరిపోక పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి .

\- మౌటం శ్రీను, కమలాపూర్

రూ.3 లక్షలు నష్టపోయిన



రూ.లక్షన్నర పెట్టి దేశరాజుపల్లి శివారులో ఐదెకరాల మామిడి తోట కౌలుకు తీసుకున్న. మరో రూ.లక్షన్నర పెట్టుబడి పెట్టిన. తీరా పంట కోతకొచ్చిన దశలో ఈదురుగాలుల బీభత్సానికి ఐదెకరాల్లోని మామిడి కాయంతా పూర్తిగా రాలిపోయింది. దీంతో తాను పడ్డ కష్టం పోనూ రూ.3 లక్షలు నష్టపోయాను.

\- మౌటం మాలగాం, కమలాపూర్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీరుకుళ్లలో పెంచికలపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.90లక్షలతో నిర్మించనున్న గోదాం పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. సహకార సంఘాల ద్వారా మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. సన్న రకం ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తుండడంతో యాసంగి సీజన్‌లో కూడా సన్నరకం వరి సాగు పెరిగిందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సహకార సంఘాలు నిర్వీర్యమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార సంఘాలను చైతన్యపర్చి అనేక రకాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కంది శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ పోతరాజు రాజు, సీఈఓ లక్ష్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, నాయకులు అర్షం వరుణ్‌గాంధీ, మార్క రజనీకర్, ఉడుత మహేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని కటాక్షపూర్ రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో డివైడర్ మూసివేయకుండా హైవే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కటాక్షపూర్, హౌజుబుజుర్గు గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు.

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న మాదాసు ప్రణయ్

ఐనవోలు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా చేపట్టాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రణయ్ మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు తమ ఇష్టమున్న వారి పేర్లు రాయించుకొని ఇళ్లు లేని నిరుపేదలను విస్మరిస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయం చేయకుండా అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొల్లపెల్లి మహేష్, మండల ప్రధాన కార్యదర్శి పొన్నాల రాజు, ఉపాధ్యక్షులు నరిగె రాజేష్, గూబ దేవేందర్, నాయకులు రవీందర్‌రెడ్డి, ఆడెపు భాస్కర్, నర్సయ్య, కుమారస్వామి, వెంకట నారాయణ, సాగర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి



ఊరుగొండలో నినాదాలు చేస్తున్న నాయకులు

దామెర: మావోయిస్టులపై అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేసి, వారితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని ప్రజాసంఘాల జేఏసీ ములుగు జిల్లా చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఊరుగొండ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో వేల కోట్ల విలువైన సహజ వనరులను, ఖనిజ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడం కోసం అమాయక గిరిజనులను చంపుతున్నారని, దేశ ప్రజలను చంపడమే ఆపరేషన్ కగార్ లక్ష్యమా? అని అన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్లకు దోచిపెట్టడమే రాజ్యాంగ సూత్రమా అని ప్రశ్నించారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినప్పటికీ వారిని ఎన్‌కౌంటర్ చేయడం తగదని కర్రెగుట్టల నుంచి కేంద్ర బలగాలను వెనక్కి రప్పించి మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దామెరకొండ కొమురయ్య, ప్రజా సంఘాల జేఏసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, బీసీ రాజ్యాధికారి సమితి నాయకుడు మిర్యాల కుమార్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పల్లెర్ల సతీష్, నల్లా నర్సయ్య, పోలేపాక చేరాలు, అక్కెళ్ళి అనిల్, పోలేపాక కుమార్, కందికొండ దామోదర్, నల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అష్టోత్తర శత కలశాభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకుడు



అష్టోత్తర శత కలశాభిషేకానికి హాజరైన భక్తులు

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి స్వయంభూ శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో అష్టోత్తర శత కలశాభిషేకం గురువారం యాజ్ఞికులు తంయాల రాఘవాచార్యులు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయంలో ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. రెండో రోజు గురువారం యాగశాలలో అగ్నిప్రతిష్ఠ, నిత్య హవనం, పూర్ణాహుతి గావించారు. అనంతరం అష్టోత్తర శత (108) కళశాలను సుగంధ, పరిమళ ద్రవ్యాలు, నవధాన్యాలు, పంచామృతాలు, పండ్ల రసాలు, నీటితో నింపారు. ప్రత్యేక పూజలు వేద మంత్రాలతో కలశస్థాపన చేసి స్తంభ నారాసింహుడు, గర్భాలయంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మి నరసింహ స్వామి ధృవబేరం, శ్రీ లక్ష్మణ, హనుమాన్ సహిత సీతా రామచంద్ర మూర్తి, శ్రీ గోధా కృష్ణ, శ్రీ పద్మావతి అలర్మేల్ మంగ సహిత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అభిషేకించారు. అనంతరం ధ్వజారోహణ గావించి గరుడ ముద్దలు వేసే కార్యక్రమాన్ని వైదికంగా నిర్వహించారు. కాగా గుండపు మంగ-దేవేందర్ కుటుంబ సభ్యులు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. సాయంత్రం విష్ణు సహస్ర నామ పుష్పార్చన, సకల దేవతాహ్వానం, నిత్యహవనం, మంగళశాసనం, తీర్థ ప్రసాదగోష్ఠి జరిపించారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు జయ కృష్ణమాచార్యులు, ఆరుట్ల రామాచార్యులు, విక్రమాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేయొద్దు

- పరకాల ఏసీపీ సతీష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సతీష్‌బాబు

పరకాల: భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల నేపధ్యంలో ఎటువంటి గొడవలకు తావిచ్చే మెసేజ్‌లను సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దని పరకాల ఏసీపీ సతీష్‌బాబు హెచ్చరించారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పరకాల పోలీస్‌స్టేషన్‌లో గురువారం పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతిఒక్కరు కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో దేశ సమగ్రతకు పాటుపడాలన్నారు. శాంతియుత వాతావరణం కోసం కృషి చేయాలని, సోషల్ మీడియాలో కించపర్చే పోస్టులు, తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ క్రాంతి కుమార్, ఎస్సై శివకృష్ణ, విశ్వహిందూ పరిషత్, ముస్లిం మత పెద్దలు, భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు



మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై సురేష్

వేలేరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వేలేరు ఎస్సై సురేష్ హెచ్చరించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందుబాబులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా బహిరంగంగా మద్యం సేవించడంతో మహిళలు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎవరైన బహిరంగంగా మద్యం సేవిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

యూరియా వాడకం తగ్గించాలి



ఆత్మకూరు: మాట్లాడుతున్న డాక్టర్ రాములు



కమలాపూర్‌లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త హరి



నడికూడ: మాట్లాడుతున్న ఓంప్రకాశ్

- అసిస్టెంట్ ప్రొఫెసర్ కమలాకర్
- కొనసాగుతున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం

ధర్మసాగర్: రైతులు పంటల్లో యూరియా వాడకం తగ్గించాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ కమలాకర్ సూచించారు. మండలంలోని నారాయణగిరి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల వరంగల్ ఆధ్వర్యంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడి, చెట్ల పెంపకం, రసాయనాల వాడకం తగ్గించడం, రశీదులను భద్రపర్చడం, యూరియా వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా భూసార పరీక్షలు, జీవన ఎరువులు, పచ్చిరొట్ట పైర్లు, నీమ్ కోటెడ్, వేప పూత తదితర వాటి గురించి వివరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ సుహాసిని మాట్లాడుతూ ఉద్యానవన పంటల్లో పాటించాల్సిన అంశాలు, డ్రిప్ ఫర్టిగేషన్, మల్చింగ్, పందిళ్ల సాగు, ఖరీఫ్‌లో చేయాల్సిన అంశాలపై చర్చించారు. పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. ఏఓ రాజేష్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో ఉన్నటువంటి సబ్సిడీలను, వాటికి కావాల్సిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నవ్య, వ్యవసాయ కళాశాల సిబ్బంది రాకేష్, శివాని, రైతులు పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులు వినియోగించాలి

ఆత్మకూరు: రైతులు అవసరం మేరకే ఎరువులు వినియోగించాలని శాస్త్రవేత్తలు డాక్టర్ రాములు, డాక్టర్ ప్రశాంత్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఓ యాదగిరి, ఏఈఓ ప్రవళిక, ప్రియ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: రైతులు పంట సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి మండల రాజ్‌కుమార్ సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కమలాపూర్‌లోని రైతువేదికలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీరాణిరవీందర్, వైస్ చైర్మన్ దేశిని ఐలయ్యగౌడ్, డైరెక్టర్లు జనగాని శివకృష్ణగౌడ్, సముద్రాల కృష్ణ, కిన్నెర కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏఓ శ్రీధర్‌రెడ్డి, ఏఈఓ రహీం, రైతులు పాల్గొన్నారు.



ధర్మసాగర్: మాట్లాడుతున్న ప్రొఫెసర్ కమలాకర్

నడికూడలో..

నడికూడ: మండలంలోని కొకొండ గ్రామంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేతలు డాక్టర్ ఓంప్రకాశ్, డాక్టర్ మాదేవి పాల్గొన్ని తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చులను తగ్గించడం, అవసరం మేరకు రసాయనాల వినియోగం, పంట మార్పిడిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ప్రశాంత్, ప్రదీప్, వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదవడం, రాయడం తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న

వేలేరు: మహిలందరికీ చదవడం, రాయడం తప్పనిసరిగా నేర్చుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమం సందర్భంగా ఎంఈఓ చంద్రమౌళి అధ్యక్షతన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో చదువురాని మహిళలను గుర్తించి ఉపాధ్యాయుల సహకారంతో వారికి చదవడం, రాయడం నేర్పించాలన్నారు. చదువును మధ్యలో నిలిపేసిన మహిళలు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జయసుధ, అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, వీఓలు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు నెరవేర్చాలి

- జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగయ్య



మాట్లాడుతున్న కాడబోయిన లింగయ్య

కమలాపూర్: ఎన్నికలకు ముందు గొర్ల కాపరులకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని యాదవ కమ్యూనిటీ హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.2 లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెలు పంపిణీ చేస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలన్నారు. పశు వైద్యశాలల్లో రెండేళ్ల నుంచి నట్టల మందు కూడా ఇవ్వడం లేదని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజు వీధి కుక్కల దాడులు, వివిధ రకాల ప్రమాదాల్లో వందలాది గొర్రెలు చనిపోతున్నాయని, వాటికి రక్షణ కల్పించాలన్నారు. ఈ నెల 18న జరిగే మండల సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేల్పుల రమేష్, మండల అధ్యక్షుడు కాల్వ కుమారస్వామి, కార్యదర్శి ఎల్లబోయిన రవీందర్, నాయకులు సమ్మయ్య, రమేష్, కొంరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి బాబాయ్ కుంటను కాపాడాలి

హన్మకొండ అర్బన్: జిల్లాలోని ఐనవోలు మండల పున్నేలు గ్రామంలోని బాబాయ్ కుంట (తురకకుంట)ను రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జా నుంచి కాపాడాలని విముక్త చిరుతల కచ్చి (వీసీకే) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెరిపెల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. ఈమేరకు నాయకులతో కలిసి హనుమకొండ డీఆర్‌ఓ, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ వైవీ.గణేష్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడారు. బాబాయ్ కుంటను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్లు చేసి అమ్ముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా వైదిక పార్టీ అధ్యక్షుడు కన్నాల రవి, సుమన్ బాబు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతుర్లు



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ములకనూర్ గ్రామానికి చెందిన సుంచు సాంబరాజు అనే వ్యక్తి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. షుగర్‌తో బాధపడుతున్న మృతుడికి భార్య సుమలత, ఇద్దరు కూతుళ్ల అక్షిత, శ్రీ వర్షిణి ఉన్నారు. కాగా మృతుడికి కొడుకులు లేకపోవడంతో ఇద్దరు కూతుర్లు తండ్రికి కుండపట్టి అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన పలువురిని కలిచివేసింది.